సాక్షి
కామారెడ్డి
గురువారం । 12 । అక్టోబర్ । 2023



రికార్డు మెజారిటీ ఇవ్వాలి

సీఎం కేసీఆర్‌ను రికార్డు మెజారిటీతో గెలిపించాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ప్రజలను కోరారు.

- 11లో ▸



సీఎంను ఓడిస్తాం

తమ కులానికి టికెట్లు ఇవ్వకుండా అన్యాయం చేసినందుకు సీఎం కేసీఆర్‌ను ఓడిస్తామని ముదిరాజ్‌లు పేర్కొన్నారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
36.8 /19.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కామారెడ్డి ఎస్పీ బదిలీ

సాక్షి, కామారెడ్డి: కేంద్ర ఎన్నికల సంఘం పలువురు కలెక్టర్లు, ఎస్పీలపై బదిలీ వేటు వేసింది. ఇందులో కామారెడ్డి జిల్లా ఎస్పీ బి.శ్రీనివాస్‌రెడ్డి కూడా ఉన్నారు. నాన్ కేడర్ ఎస్పీగా ఆయన 2021 డిసెంబర్ 27న కామారెడ్డిలో బాధ్యతలు చేపట్టారు. అసెంబ్లీతో పాటు పార్లమెంటు ఎన్నికలు పూర్తయ్యేదాకా ఆయన ఇక్కడే ఉంటారని భావించారు. అయితే ఎన్నికల సంఘం బదిలీ వేటు వేయడంతో పోలీసు వర్గాలు కంగుతిన్నాయి. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు కూడా పూర్తికాకముందే ఎస్పీ బదిలీ కావడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డికి ఇన్‌చార్జి ఎస్పీ బాధ్యతలు అప్పగించారు.

నిజామాబాద్ సీపీ..

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సత్యనారాయణ బదిలీ అయ్యారు. కేంద్ర ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు పోలీసు శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఆయన సీపీగా గతనెల 2న బాధ్యతలు స్వీకరించారు.

14న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 14న ఉదయం 8 గంటలకు అథ్లెటిక్స్ జిల్లా జట్లను ఎంపిక చేయనున్నారు. ఈ విషయమై జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ.అనిల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అండర్-14, 16, 18, 20 గ్రూపులలో బాలబాలికలకు రన్స్, త్రోస్, జంప్స్ అంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతో పోటీలకు హాజరు కావాలని సూచించారు.

ఆర్టీసీ ప్రయాణికులకు దసరా బహుమతి

కామారెడ్డి టౌన్: దసరా పండుగ సందర్భంగా లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు, తిరిగి 28 నుంచి 30 వ తేదీ వరకు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే వారు టికెట్ వెనకాల తమ ఫోన్ నంబర్, పేరు, వివరాలు రాసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో వేయాలని సూచించారు. నవంబర్‌లో లక్కీడ్రా తీసి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

104 ఉద్యోగుల సమ్మె వాయిదా

కామారెడ్డి టౌన్: వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న 104 ఉద్యోగులు చేపట్టిన సమ్మెను వాయిదా వేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారులతో చర్చలు జరిగాయని పేర్కొన్నారు. త్వరలో ఉద్యోగుల సమస్యలను పరి ష్కరిస్తామని అధికారులు ఇచ్చిన హామీ మేరకు సమ్మెను వాయిదా వేశామని తెలిపారు. ఉద్యోగుల డిమాండ్‌లను పరిశీలించకపోతే మళ్లీ సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'




సదాశివనగర్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పద్మాజీవాడి చౌరస్తా వద్దనున్న పార్టీ కార్యాలయంలో ఉత్తునూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సంతోష్ పాటిల్, ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి, తిర్మన్‌పల్లి సర్పంచ్ బాల్‌రెడ్డి, నాయకులు చిందం రాజయ్య, గాదారి నర్సారెడ్డి, జనగామ రాజు, నరేశ్ గౌడ్, ఎల్లయ్య, నర్సారెడ్డి పాల్గొన్నారు.

బీసీ, దళిత బంధు పథకాలకు బ్రేక్

మోర్తాడ్: బీసీ, దళితబంధు పథకాల అమలు వాయిదా పడింది. దళితబంధు రెండో విడతలో ఒక్కో నియోజకవర్గానికి 1,100 మందికి, బీసీల్లో 300 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేసి ఆర్థిక సాయం అందించాల్సి ఉంది. ఈ ఏడాది ఆరంభంలోనే రెండో విడత దళితబంధు అందించాల్సి ఉన్నా లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర జాప్యం జరిగింది. బీసీ బంధు రెండో విడత సెప్టెంబర్‌లోనే ఇవ్వాల్సి ఉన్నా సకాలంలో లబ్ధిదారులను ఎంపిక చేయలేకపోయారు. ఎలక్షన్ కోడ్ అమలులోకి రావడంతో ఇప్పట్లో యూనిట్లు ఇచ్చే అవకాశాలు లేవు.

అభ్యర్థి ఎవరో..?

- ఇంకా తేల్చని కాంగ్రెస్ అధిష్టానం
- హస్తినకు పోయివస్తున్న ఆశావహులు
- పార్టీ శ్రేణుల్లో అయోమయం



ఓవైపు అధికార బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించడంతోపాటు ప్రచారంలోనూ దూసుకుపోతుండగా.. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం ఇంకా ఎటూ తేల్చడం లేదు. అభ్యర్థి ఎవరో తెలియక కాంగ్రెస్ శ్రేణులు అయోమయానికి గురవుతున్నాయి. టికెట్లు ఆశిస్తున్న నేతలు మాత్రం హస్తిన చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

సాక్షి, కామారెడ్డి: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయడానికి ఆసక్తిగలవారినుంచి ఆగస్టులోనే దరఖాస్తులు స్వీకరించింది. కామారెడ్డి నుంచి పోటీ చేయడానికి ఇద్దరు, ఎల్లారెడ్డినుంచి నలుగురు, జుక్కల్‌నుంచి ఎనిమిది మంది దరఖాస్తు చేసుకోగా.. బాన్సువాడనుంచి అత్యధికంగా 16 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించిన పార్టీ రాష్ట్ర నాయకత్వం.. ఒక్కో నియోజకవర్గానికి ఇద్దరు, ముగ్గురి పేర్లతో జాబితా రూపొందించి అధిష్టానానికి పంపించింది. ఈ జాబితా పంపించి నలభై రోజులు కావస్తున్నా.. ఇప్పటికీ అభ్యర్థులను ప్రకటించలేదు. ఈనెల 13, 14 తేదీలలో జరిగే కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశాల్లో అభ్యర్థుల ఎంపిక అంశం కొలిక్కి వస్తుందని భావిస్తున్నారు.

షబ్బీర్ ఓకే.. మిగతా చోట్ల?

కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ మంత్రి షబ్బీర్ అలీ బరిలో నిలవడం దాదాపు ఖరారైనట్లే.. ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్టానం ప్రకటించడమే మిగిలి ఉంది. ఆయన కొంతకాలంగా ఊళ్లను చుట్టేస్తున్నారు. సీఎం పోటీ చేస్తానన్నా సరే వెనక్కి తగ్గకుండా ప్రచారం నిర్వహిస్తూ జనం మధ్యలో ఉంటున్నారు. అయితే మిగతా మూడు నియోజకవర్గాలలో ఎవరి పేరు ఖరారవుతుందో తెలియక పార్టీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నాయి.

ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి పీసీసీ ప్రధాన కార్యదర్శి సుభాష్‌రెడ్డితో పాటు పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రావు టికెట్టు ఆశిస్తున్నారు. ఎవరి స్థాయిలో వారు పార్టీ అభ్యర్థిత్వం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా తనకు అవకాశం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ప్రయత్నించినట్లు తెలిసింది. అయితే ఆయన ప్రయత్నాలు ఫలించలేదని సమాచారం. బాన్సువాడ టికెట్టుకోసం నియోజకవర్గ ఇన్‌చార్జీగా కొనసాగుతున్న కాసుల బాల్‌రాజుతో పాటు జ్యోతిర్మయరెడ్డి, మరికొందరు ప్రయత్నించారు. అయితే ఎల్లారెడ్డిలో టికెట్ ఆశిస్తున్న సుభాష్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావులలో ఒకరిని బాన్సువాడకు పంపించాలని కాంగ్రెస్ నాయకత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. అయితే ఇద్దరు కూడా ఎల్లారెడ్డి కోసమే పట్టుబడుతుండడంతో బాన్సువాడ వ్యవహారం కూడా తేలడం లేదు. జుక్కల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గంగారాంతో పాటు మరి కొందరు టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు.

ఎవరికి దక్కేనో..

మెజారిటీ సీట్లు గెలవాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ నాయకత్వం టికెట్ల కేటాయింపు విషయంలో గట్టి కసరత్తు చేస్తోంది. గెలుపు గుర్రాలను ఎంపిక చేయడానికి రకరకాల సర్వేలను ప్రామాణికంగా తీసుకుంటోంది. అయితే టికెట్ల విషయంలో స్క్రీనింగ్ కమిటీ సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదు. ముఖ్యంగా ఎల్లారెడ్డి టికెట్ విషయంలో రాష్ట్రానికి చెందిన ముఖ్య నేతల మధ్య వార్ నడుస్తోంది. సుభాష్‌రెడ్డికి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అండగా నిలవగా, మదన్‌మోహన్‌రావుకు ఇతర నేతలు మద్దతుగా ఉంటున్నారు. దీంతో అభ్యర్థిత్వంపై ఎటూ తేల్చలేకపోతున్నారు.

ఢిల్లీ చుట్టూ చక్కర్లు..

టికెట్లు ఆశిస్తున్న హస్తం పార్టీ నేతలు.. హస్తినకు వెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారు. స్క్రీనింగ్ కమిటీ సమావేశాల్లో ఏ విషయం కొలిక్కి రాలేదు. ఈ నేపథ్యంలో ఆశావహులు ఢిల్లీ నుంచి తిరిగి వచ్చారు. గురువారం మరోసారి ఢిల్లీ వెళ్లే ఆలోచనలో ఉన్నారు. టికెట్ల కేటాయింపు అంశం కొలిక్కి రాకపోవడంతో ఆశావహుల అనుచరుల్లో అయోమయం నెలకొంది. తమ నాయకుడికి టికెట్ వస్తుందో రాదోనని వారు ఆందోళనకు గురవుతున్నారు. ఢిల్లీలో ఏం జరుగుతుందోనంటూ చర్చించుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో రకరకాల ప్రచారాలు జరుగుతుండడంతో మరింత గందరగోళానికి లోనవుతున్నారు. ఎల్లారెడ్డి టికెట్ తమ నాయకుడికే ఖరారైందని ఒక నాయకుడి అనుచరులు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తే, ఇంకో నాయకుడి అనుచరులు కాదు, తమ నాయకుడికే టికెట్ పక్కా అంటూ పోటీగా పోస్టులు పెడుతున్నారు.

తెరపైకి ఏనుగు మంజులారెడ్డి!

- క్రియాశీల రాజకీయాల్లోకి మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి సతీమణి
- ఎల్లారెడ్డి బీజేపీ టికెట్‌పై ఆశలు



సాక్షి, కామారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రాజకీయాలు మారుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి సతీమణి మంజులారెడ్డి క్రియాశీల రాజకీయాల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. ఆమె అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.

ఏనుగు రవీందర్‌రెడ్డి రాజకీయాల్లో అడుగుపెట్టిన నాటి నుంచి ఎన్నికల వ్యవహారాలతో పాటు క్యాడర్ బాధ్యతను ఆయన సతీమణి మంజులారెడ్డే చూసుకుంటున్నారు. ఉన్నత విద్యనభ్యసించిన మంజులారెడ్డికి రాజకీయాలపై మొదటి నుంచి ఆసక్తి ఉంది. భర్త రవీందర్‌రెడ్డితో కలిసి పార్టీ కార్యక్రమాలలో పాల్గొంటూ వచ్చారు. 2004 లో టీఆర్ఎస్ టికెట్‌ను మొదట మంజులారెడ్డికే కేటాయించాలని భావించారు. అయితే ఆమె స్థానంలో రవీందర్‌రెడ్డికి ఇచ్చారు. రవీందర్‌రెడ్డి గెలుపు కోసం మంజులారెడ్డి ఎంతో శ్రమించారు. ఎన్నికల సమయంలో ఆమె నియోజకవర్గం అంతటా తిరుగుతూ ప్రచారం చేశారు. తాడ్వాయి మండలంలో అయితే ప్రతి ఇల్లూ ఆమెకు పరిచయమే.. 2018 ఎన్నికల్లో రవీందర్‌రెడ్డి అనూహ్యంగా ఓటమి చెందారు. అయినప్పటికీ నియోజకవర్గంలో ఆమె అనుచరులకు భరోసా ఇస్తూ వస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన జాజాల సురేందర్ బీఆర్ఎస్‌లో చేరడంతో పార్టీలో రెండు గ్రూపులయ్యాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేగా సురేందర్‌రెడ్డికి పార్టీలో, ప్రభుత్వంలో ప్రాధాన్యత ఇవ్వడం, రవీందర్‌రెడ్డికి నామినేటెడ్ పదవులు దక్కకపోవడంతో ఆయన బీజేపీలో చేరారు. దీంతో బీజేపీ అభ్యర్థిగా ఆయన పోటీ చేస్తారని భావించారు. కానీ ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో బీజేపీలో అసంతృప్తితో ఉన్న ఆయన కాంగ్రెస్‌లో చేరతారన్న ప్రచారం జరిగింది. బీజేపీ నాయకత్వం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను పరిశీలించి అసంతృప్తులను చేరదీసి పదవులు కట్టబెట్టడంతో కొంత వెనక్కి తగ్గారు. భవిష్యత్తులో మహిళా రిజర్వేషన్లు అమలులోకి వచ్చే అవకాశాలు ఉండడంతో తనకు బదులుగా తన భార్య మంజులారెడ్డిని బరిలో నిలిపేందుకు రవీందర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. రవీందర్‌రెడ్డి అనుచరులు సైతం గట్టి నిర్ణయం తీసుకోవాలని ఒత్తిడి తెస్తుండడంతో ఎల్లారెడ్డి రాజకీయాల్లో కొనసాగాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆయన తన భార్యకు బీజేపీ టికెట్టుకోసం ప్రయత్నించే అవకాశాలున్నాయి.

'భూములు గుంజుకోవడానికే వస్తున్నరు'




రెడ్డిపేటలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

రామారెడ్డి: ఇక్కడి విలువైన భూములను గుంజుకోవడానికే కల్వకుంట్ల కుటుంబం కామారెడ్డిపై దండయాత్ర చేస్తోందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆరోపించారు. బుధవారం రెడ్డిపేట జగదాంబ తండా, బట్టితండాలలో షబ్బీర్ అలీ పర్యటించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఉద్యోగాల కోసమే తెలంగాణ పోరాటం చేశామన్న కేసీఆర్.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరింతమందిని నిరుద్యోగులాగా మార్చి ఊరూరా బెల్ట్ షాపులను ప్రోత్సహించి కుటుంబాలను సర్వనాశనం చేశాడని ఆరోపించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎక్కడ కట్టారో చూపించాలని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. దళితబంధు బీసీబంధు పేరుతో కులాల మధ్య చిచ్చుపెట్టారన్నారు. పోడు భూములకు పట్టాలివ్వకుండా రైతులను గోస పెడుతున్న బీఆర్ఎస్‌కు బుద్ధి చెబుతామన్నారు. అధికారంలోకి వస్తే అమలు చేసే కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ ఫ్లోర్‌లీడర్ మోహన్‌రెడ్డి, నాయకులు మద్దికుంట నర్సాగౌడ్, పండ్ల రాజు, కుమ్మరి శంకర్, బండి ప్రవీణ్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సీఎంపై పోటీ చేస్తాం'

కామారెడ్డి టౌన్: సమస్యల పరిష్కారం కోసం సీఎం కేసీఆర్‌పై పోటీ చేయాలని నిర్ణయించినట్లు కామారెడ్డి ఓన్ ఫార్మర్స్ బాయిలర్ అసోసియేషన్ అధ్యక్షుడు గరిగె వెంకట్‌రావు తెలిపారు. ఆయన బుధవారం జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ వైఖరితో పౌల్ట్రీ రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన మక్కలను 40 శాతం సబ్సిడీపై పౌల్ట్రీ రంగానికి ఇవ్వాల్సి ఉండగా కేసీఆర్ ప్రభుత్వం దళారులకు అమ్ముకుంటోందని ఆరోపించారు. గత ప్రభుత్వాల హయాంలోనే పౌల్ట్రీ రైతులకు మేలు జరిగిందని, ప్రస్తుతం ఇబ్బందులే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను అన్ని పార్టీల దృష్టికి తీసుకువెళ్లేందుకు కామారెడ్డినుంచి బరిలో నిలవాలని నిర్ణయించామన్నారు. తమ తరపున వెంకట్‌రావు బరిలో ఉంటారని యూనియన్ ప్రతినిధులు తెలిపారు. సమావేశంలో యూనియన్ ఉపాధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి, ప్రతినిధులు రామ్ అశోక్‌వర్ధన్, ప్రసాద్‌రావు, రాజిరెడ్డి, సంతోష్‌రెడ్డి, సురేష్‌గౌడ్, శేఖర్, పండ్ల రాజు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్‌రావు

'కేసీఆర్ రాకతో సమగ్రాభివృద్ధి'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేయనుండడంతో ఈ ప్రాంతం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి శేరి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని బృందావన్ గార్డెన్‌లో పార్టీ సమావేశం నిర్వహించారు. పట్టణ పోలింగ్ బూత్ కమిటీలకు కన్వీనర్‌లను నియమించడంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని అభివృద్ధి తెలంగాణలో జరుగుతోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని నాయకులకు సూచించారు. భారీ మెజారిటీతో సీఎంను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావు, కౌన్సిలర్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బకెట్‌లో పడి బాలుడి మృతి



మాక్లూర్: బకెట్‌లో పడి 15 నెలల బాలుడు మృతి చెందిన ఘటన మాక్లూర్ మండలం మెట్‌పల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. సర్పంచ్ చిన్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నవీన్, వాణి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం వారు గేదెలకోసం బకెట్‌లో కుడితి కలిపి పెట్టారు. వారి రెండో కుమారుడు నిషేక్(15 నెలలు) ఆడుకుంటూ వెళ్లి ఆ బకెట్‌లో పడ్డాడు. అక్కడే ఉన్న తల్లిదండ్రులు గమనించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ప్రతి ఖర్చును లెక్కల్లో చూపాలి

- అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలపై విచారణ చేస్తాం
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఎన్నికల నియమావళి ప్రకారం అభ్యర్థి రోజు వారీ ఖర్చుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఖర్చులను లెక్కించే విధానంపై అవగాహన కల్పించారు. అభ్యర్థి చేసిన ప్రతి ఖర్చును లెక్కలో చూపాలన్నారు. సభలు, ర్యాలీలు, సమావేశాలకు ముందస్తుగా పోలీసుల అనుమతి పొందాలన్నారు. ప్రకటనలు, కరపత్రాలు, పోస్టర్ల ముద్రణకు సైతం అనుమతి తీసుకోవాలని సూచించారు. ముద్రణ సంస్థ పేరు, మొబైల్ నంబర్, ముద్రించిన ప్రతుల వివరాలను నమోదు చేయాలన్నారు. వ్యయ నియంత్రణకు సంబంధించిన బుక్‌లెట్‌తో పాటు షామియానా, కుర్చీలు, బల్లలు, మైకు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, భోజనం, హోటల్ గదుల అద్దె, వాహనాల అద్దె తదితర ఖర్చులకు సంబంధించి నిర్ధారించిన ధరల ప్రతులను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ధరలపై అభిప్రాయాలను రేపటిలోగా తెలపాలని కోరారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, రేడియోలలో ప్రకటనలకు సంబంధించి సమాచార శాఖ నిర్ధారించిన రేట్ కార్డులనూ అందించారు. ఎన్నికల వ్యయాన్ని నియంత్రించేందుకు ఎలక్షన్ కమిషన్ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలను తనిఖీ చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు జూకంటి ప్రభాకర్, మదన్‌లాల్ జాదవ్, ఖాసిం అలీ, అమర్ సింగ్, జఫార్ ఖాన్, అనిల్ కుమార్, నరేందర్, ఎలక్షన్ సూపరింటెండెంట్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సాయిలు



తెయూ(డిచ్‌పల్లి): తెయూ సారంగపూర్ క్యాంపస్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సాయిలు నియామకమయ్యారు. ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి సాయిలుకు నియామక ఉత్తర్వులను బుధవారం అందజేశారు. తనపై నమ్మకంతో ప్రిన్సిపాల్‌గా నియమించిన ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్‌లకు సాయిలు కృతజ్ఞతలు తెలిపారు.

ఎకనామిక్స్ బీవోఎస్ చైర్మన్‌గా సంపత్



తెయూ(డిచ్‌పల్లి): తెయూ యూనివర్సిటీ ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) చైర్మన్‌గా టి.సంపత్ నియామకమయ్యారు. తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి సంపత్‌కు నియామక ఉత్తర్వులు అందజేశారు. తనపై నమ్మకంతో బీవోఎస్ చైర్మన్‌గా నియమించిన ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్‌లకు సంపత్ కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దవాగులో ఇసుక రవాణా నిషేధం



వేల్పూర్: మండలంలోని జానకంపేట్, పచ్చల నడ్కుడ గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగులో ఇసుక రవాణా చేయడం నిషేధించినట్లు పోలీసులు, రెవెన్యూ అధికారులు బుధవారం తెలిపారు. తమ ఆంక్షలను ఎవరైనా ధిక్కరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పెద్దవాగు నుంచి కొంతకాలంగా పచ్చలనడ్కుడ గ్రామస్తులు ఇసుక తీయనీయడం లేదని జానకంపేట్ గ్రామస్తులు కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు ఇరు గ్రామాల ప్రజలు ఇసుక తీయకుండా ఆంక్షలు విధించినట్లు ఏఎస్సై యాదగిరి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేణు తెలిపారు.

దరఖాస్తులకు మోక్షమెప్పుడో..

- ధ్రువపత్రాల మంజూరులో తీవ్ర జాప్యం
- పెద్దల సేవలకు పెద్దపీట
- సామాన్యులకు తప్పనితిప్పలు

ఇందల్వాయి: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సమస్యలపై తహసీల్ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యపు సమాధానాలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందల్వాయి మండలంలోని తహసీల్ కార్యాలయంలో సమస్యలు, ధ్రువపత్రాల మంజూరు కోసం వచ్చే సామాన్య ప్రజలకు న్యాయం జరగడం లేదు. అధికారులు, సిబ్బంది లేకపోవడంతో చేసిన దరఖాస్తులు కుప్పలు కుప్పలుగా అధికారుల టేబుళ్లపై దర్శనమిస్తున్నాయి. రాజకీయ పలుకుబడి, డబ్బున్న వారికి మాత్రం ఎలాంటి విచారణ లేకుండానే తక్షణమే ధ్రువపత్రాల మంజూరు, ఫిర్యాదులు పరిష్కారమవుతున్నాయన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పేదల ప్రభుత్వమని చెప్పుకొనే బీఆర్ఎస్ హయాంలో సామాన్య ప్రజలకు న్యాయం జరగకుండా పోతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

మాయమవుతున్న దరఖాస్తులు..

తహసీల్ కార్యాలయంలో సమర్పించే కల్యాణలక్ష్మి, ఆదాయ, కుల, జనన, మరణ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు కొన్ని మాయమవుతున్నాయి. కార్యాలయంలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను జాగ్రత్తగా ఉంచాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంలో సరైన సమయంలో ధ్రువపత్రాలు మంజూరు కాక లబ్ధిదారులు, సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు ఆమ్యామ్యాలు ఇచ్చే వారి దరఖాస్తులను భద్రపరుస్తూ సామాన్య ప్రజలవి చెత్తబుట్టలో వేసే చిత్తు కాగితాలా పడేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. రెండు నెలలుగా దరఖాస్తు చేసినా ధ్రువపత్రాలు మంజూరు కావడం లేదంటూ స్థానిక ప్రజలు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సెలవుల్లో అధికారులు

అధికారుల అలసత్వానికి తోడు వీఆర్వోలు, వీఆర్ఏలు కార్యాలయంలో లేక పోవడం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కార్యాలయంలో అటు అధికారులు లేక ఇటు సిబ్బంది లేక తమ దరఖాస్తులు, ధ్రువపత్రాలు ఎలా మంజూరవుతాయో వీటికి మోక్షమెప్పుడో అని అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సైతం తరచూ సెలవుల్లో ఉండడంతో ధ్రువపత్రాల పరిశీలన, విచారణ వేగవంతంగా జరగడం లేదు. డిప్యూటీ తహసీల్దార్ విధుల్లో చేరి నాలుగు నెలలవుతున్నా ఏనాడూ కార్యాలయానికి సరిగా రావడం లేదు. ప్రస్తుతం సదరు అధికారి సెలవుల్లో ఉన్నా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించక పోవడంతో పహాణీ నకల్లు అందించడంతో పాటు ఇతర సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది.



నల్లవెల్లి గ్రామానికి చెందిన వాడె గంగాధర్ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం ఆగస్టులో మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకొని తహసీల్ కార్యాలయంలో సంబంధిత పత్రాలను సమర్పించాడు. నాటి నుంచి నేటి వరకు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సర్టిఫికెట్ మంజూరు కావడం లేదు. ఇదేంటని అడిగితే అధికారులు సెలవుల్లో ఉన్నారని, విచారణ చేపట్టడానికి సమయం పడుతుందని కార్యాలయ సిబ్బంది పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. రెండు నెలలు గడుస్తున్నా ధ్రువపత్రం మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు బాధితుడు పేర్కొన్నాడు.



ఇందల్వాయి తహసీల్ కార్యాలయం



ఆర్ఐ టేబుల్‌పై ఉన్న దరఖాస్తులు



నెల రోజులుగా ఖాళీగా ఉన్న డీటీ చైర్

సిబ్బంది లేక ఆలస్యం..

వీఆర్ఏలు లేక పోవడం, అధికారులు సెలవుల్లో ఉండడం, ఆర్ఐ బదిలీ కావడంతో దరఖాస్తులు, ధ్రువపత్రాల మంజూరులో ఆలస్యమవుతోంది. దీనికి తోడు ఎన్నికల విధులు అదనంగా ఉండడంతో ఇబ్బంది పడుతున్నాం. ధ్రువపత్రాలు త్వరగా మంజూరయ్యేలా సిబ్బందితో కలిసి కృషి చేస్తాం.

–వెంకట్‌రావు, తహసీల్దార్, ఇందల్వాయి

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఎల్లారెడ్డిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెక్టోరల్ అధికారి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను సెక్టోరల్ అధికారి నారాయణ బుధవారం పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎర్రమన్నుకుచ్చ ప్రాథమిక పాఠశాల, మల్లయ్యపల్లి, అచ్చాయిపల్లి గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి పోలింగ్ కేంద్రాలలో ఉన్న వసతులు, వాటి వివరాలను నమోదు చేసుకున్నారు.

బిచ్కుందలో..

బిచ్కుంద(జుక్కల్): శెట్లూర్‌లో పోలింగ్ బూత్‌ను బుధవారం ఎంపీడీవో ఆనంద్ పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని జీపీ కార్యదర్శిని ఆదేశించారు. మరుగుదొడ్లు లేని చోట వారం రోజులలో మరుగుదొడ్లు నిర్మించాలని సర్పంచ్, కార్యదర్శిని ఆదేశించారు. వికలాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలి, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు ఉండే విధంగా అన్ని పనులు పూర్తి చేయాలని సూచించారు.

రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్ నమోదు



అమీర్‌కు నోటీసులు అందజేస్తున్న సీఐ

ఖలీల్‌వాడి: నగరంలోని ఆటోనగర్ ప్రాంతానికి చెందిన అమీర్, అలీఖాన్ అలియాస్ బర్సత్ అమేర్‌పై పోలీసులు పీడీ యాక్ట్ నమోదుచేసి జైలుకు బుధవారం తరలించారు. అమీర్ 2019 నుంచి అనేక నేరాలకు పాల్పడడంతో పోలీసులు అభియోగపత్రాన్ని నమోదు చేశారు. సీపీ ఆదేశాల మేరకు అమీర్‌కు నోటీసులు అందించి జైలుకు తరలించినట్లు సీఐ వెంకట్‌నారాయణ తెలిపారు.

బాలికలపై వేధింపులు బాధాకరం

జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తులు

కామారెడ్డి క్రైం: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి అన్నారు. ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రాంగణంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. దేశం ఎంతో పురోగమిస్తున్నా ఇంకా బాలికలపై వేధింపులు, అక్రమ రవాణా జరగడం బాధాకరమన్నారు. గ్రామీణ ప్రాంతాలలో అవగాహన లోపం, పేదరికం తదితర కారణాలతో చదువుకునే వయస్సులో పనులకు పంపడం, 18 ఏళ్లు నిండకుండానే బాల్య వివాహాలు చేయడం లాంటి ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. నియంత్రణకు పోలీసు, మహిళా, శిశు సంక్షేమం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ నాయక్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.శ్రీదేవి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి భార్గవి, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఇంచార్జి మల్లేష్ గౌడ్, సాధన స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కొప్పుల రవి, న్యాయవాదులు పాల్గొన్నారు.

నగదు తరలిస్తే ఆధారాలు చూపాల్సిందే

సలాబత్‌పూర్ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మద్నూర్(జుక్కల్): ప్రజలు రూ.50 వేలకు మించి డబ్బులను తమతో పాటు తీసుకెళ్లే అధికారులకు లెక్కలు చూపించాల్సిందేనని లేకుంటే డబ్బు సీజ్ చేస్తామని తహసీల్దార్ మహమ్మద్ ముజీబ్ సూచించారు. తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ వద్ద పోలీసుల తనిఖీలు కొనసాగుతున్నాయి. ఎన్నికల సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను పోలీసులు క్షుణంగా తనిఖీలు చేస్తున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం, చీప్ లిక్కర్, నగదు తరలించకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై కృష్ణారెడ్డి అన్నారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా మద్యం, డబ్బు తరలించకుండా పోలీసు సిబ్బంది నిత్యం తనిఖీలు చేస్తారని ఆయన చెప్పారు. ఎన్నికలు ముగిసే వరకు చెక్‌పోస్టు కొనసాగుతుందని ఆయన వెల్లడించారు.

ఈ దారుల్లో తనిఖీలు ఎట్లా?

ఇది ఇలా ఉంటే మహారాష్ట్ర, కర్ణాటక నుంచి మన రాష్ట్రంలోకి ప్రవేశించడానికి ప్రధాన రహదారులే కాకుండా పలు పల్లె రహదారులు కూడా ఉన్నాయి. మద్నూర్, జుక్కల్ మండలాలకు మహారాష్ట్ర, కర్ణాటకలతో సరిహద్దులు ఉన్నాయి. మద్నూర్‌కు మహారాష్ట్ర, జుక్కల్ మండలానికి కర్ణాటక సరిహద్దులు ఉన్నాయి. ఈ రెండు మండలాల్లోని మారుమూల గ్రామాల నుంచి తెలంగాణలోకి పల్లె రహదారులున్నాయి. మద్నూర్ మండలంలోని పెద్ద శక్కర్గ, చిన్న శక్కర్గ, పెద్ద తడ్గూర్, ఖరగ్, చిన్న తడ్గూర్, గోజేగావ్ శివారులోంచి మన రాష్ట్రంలోకి ప్రవేశించవచ్చు. జుక్కల్ మండలంలోని సోపూర్, గుండూర్, గుల్లా, కత్తల్‌వాడి, హంగర్గ రోడ్ల ద్వారా కర్ణాటక, మహారాష్ట్రలోనికి దారులు ఉన్నాయి. పోలీసులు ఈ దారుల వెంట ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

వాహనాల తనిఖీల్లో నగదు పట్టివేత



బోధన్‌లో మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్



సలాబత్‌పూర్‌లో మాట్లాడుతున్న పోలీసులు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంతో పాటు సాలూర చెక్ పోస్టు వద్ద పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రూ.11లక్షల80వేలు పట్టుకున్నట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. పట్టణంలోని ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన సాలంపాడ్ మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి రూ. 9 లక్షలతో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పట్టణంలోని అనిల్ టాకీస్ చౌరస్తాలో, షేక్ షఫీ ద్విచక్ర వాహనంపై రూ. లక్షా80 వేలతో అదే చౌరస్తాలో వెళ్తుండగా వాహనాల తనిఖీలో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నగదుకు సంబంధించిన ఆధారాలు లేక పోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సాలూర మండలంలోని చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన మహదేవ్ నుంచి రూ.లక్షతో ద్విచక్ర వాహనంపై బోధన్ వైపునకు వస్తున్నట్లు తెలిపారు. ఈ నగదును ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి ఆంజనేయులుకు అప్పగించామన్నారు.

భయాందోళనకు గురి కావొద్దు

ఎన్నికల షెడ్యూలు విడులైన సందర్భంగా పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో డబ్బులు పట్టుబడితే, నగదుకు సంబంధించిన ఆధారాలు చూపితే అప్పగిస్తామని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలు తమ అవసరాల నిమిత్తం రూ. 50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకెళ్లద్దని సూచించారు. మద్యం, డబ్బుల పంపిణీని అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టులో..

మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్‌పూర్ వద్ద తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు రూ.2.40 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని దెగ్లూర్ నుంచి సలాబత్‌పూర్ మీదుగా స్విఫ్ట్ కారులో వెళ్తున్న ఇమామ్‌ఖాన్ అనే వ్యక్తి వద్ద ఈ నగదు లభించడంతో పోలీసులు పట్టుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ కోశిడ్గేవార్ మహేశ్, తహసీల్దార్ మహమ్మద్ ముజీబ్, ఎస్సై కృష్ణారెడ్డి, ఆర్ఐ శంకర్, సిబ్బంది ఉన్నారు.

ఎస్ఎస్ఆర్ కళాశాల వద్ద..

నిజామాబాద్‌రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారులు చేపడుతున్న నాకాబందీ కార్యక్రమంలో భాగంగా ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల వద్ద బైక్ నుంచి రూ.లక్షా 50వేలు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్ కుమార్ తెలిపారు. ఈ నగదును జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతుకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

జిల్లా కేంద్రంలో..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పరిధిలో వాహనాల తనిఖీల్లో నలుగురు వ్యక్తుల నుంచి నగదుతో పాటు బంగారం లభించినట్లు ఎస్‌హెచ్‌వో విజయబాబు తెలిపారు. తనిఖీల్లో నలుగురు వ్యక్తుల నుంచి రూ.1,18,500, రూ.2.50 లక్షలు, రూ.68,500, రూ.92,600 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరో వ్యక్తి నుంచి 25 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసి విచారణ నిమిత్తం ఎంసీసీ బృందానికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

భిక్కనూరు చెక్‌పోస్టు వద్ద..



భిక్కనూరు: మండల సమీపంలోని చెక్‌పోస్టు వద్ద తనిఖీలో భాగంగా ఒకరి నుంచి రూ.లక్షాయాభై వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తిరుపయ్య, ఎస్సై సాయికుమార్ తెలిపారు. తాడ్వాయి మండలం ఎర్రపహాడ్‌కు చెందిన సుధాకర్‌గౌడ్ కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా తనిఖీలో నగదు లభించిందన్నారు. ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి



బండి రామగిరి (ఫైల్)

భిక్కనూరు: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సాయి కుమార్ కుమార్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ బండి రామగిరి (38) మంగళవారం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం మండల కేంద్రానికి సమీపంలోని ఓ దాబా వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. గమనించిన స్థానికులు, దాబా సిబ్బంది కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..



కృష్ణమూర్తి (ఫైల్)

పెద్దకొడప్‌గల్(జుక్కల్): పెద్దకొడప్‌గల్ శివారులోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కామరాజు కృష్ణమూర్తి(24) ఉదయం పొలం నుంచి పచ్చిగడ్డి తీసుకొస్తుండగా పిట్లం నుంచి బిచ్కుంద వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం కృష్ణమూర్తిని ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో ..

బోధన్‌టౌన్: బోధన్‌లోని నర్సాపూర్‌కు చెందిన భైరి రాజు(38) బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. నర్సాపూర్‌కు చెందిన రాజు వ్యవసాయ కూలీగా పని చేసేవాడు. బుధవారం సాయంత్రం నర్సాపూర్ శివారు ప్రాంతంలోగల బోరు మోటారు సమీపానికి వెళ్లాడు. అక్కడ తెగి పడి ఉన్న విద్యుత్ వైరుపై కాలు పెట్టడంతో షాక్ కొట్టి మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు కింద పడి మరొకరు..

ఖలీల్‌వాడి: ఎడపల్లి మండలం జాన్కంపేట్ రైల్వే పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై తావూనాయక్ తెలిపారు. మృతుడి వయస్సు 35 సంవత్సరాల వరకు ఉంటుందని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే 8712658591 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

కెమికల్ ఫ్యాక్టరీలో..



బబ్లూ మృతదేహం

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి శివారులోని కెమికల్ ల్యాబరేటరీలో బుధవారం జరిగిన ప్రమాదంలో ఒక్కరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. జంగంపల్లి శివారులో ని విజయసాయి కెమికల్ ల్యాబరేటరీలో బుధవారం వేకువ జామున సాల్వెంట్ డ్రమ్ములను అన్‌లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అపరేటర్లుగా పనిచేస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన బబ్లూ (48), ఉత్తర ప్రదేశ్‌కు చెందినన జగదీశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందు తూ బబ్లూ మృతి చెందాడు. జగదీశ్ పరిస్థితి విషమంగా ఉంది.

రోడ్డు ప్రమాదంలో మహిళ..



సంధ్యారాణి (ఫైల్)

మాచారెడ్డి: మండలంలోని భవానీపేట–ఆరెపల్లి గ్రామాల మధ్య బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. పాల్వంచ మండలం ఫరీద్‌పేటకు చెందిన తగిరంచ సంధ్యారాణి (28) జ్వరంతో బాధపడుతోంది. సమీప బంధువు ద్విచక్ర వాహనంపై కామారెడ్డి ఆస్పత్రికి తీసుకవెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సంధ్యారాణి అక్కడికక్కడే మృతిచెందింది. సంధ్యారాణి కుమారుడు భువంత్‌రెడ్డి, కూతురు భవ్యశ్రీలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. సంధ్యారాణి భర్త ఏడాది క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడి అరెస్ట్

కామారెడ్డి క్రైం: వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు దొంగిలించిన నిందితుడిని పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అనిల్ బుధవారం తెలిపారు. ఈ నెల 9న గాంధీ గంజ్ ప్రాంతంలో ఓ వృద్ధురాలి ఇంట్లో నిందితుడు ప్రవేశించి ఆరు తులాల బంగారు గొలుసుని లాక్కుని పరారయ్యాడు. నిందితుడిని మెట్‌పల్లికి చెందిన యాదగిరిగా గుర్తించగా కామారెడ్డిలో పట్టుకుని కేసు నమోదు చేశారు.

జేసీబీ సీజ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని చీనూర్‌లో జేసీబీతో అక్రమంగా మొరం తవ్వకాలు చేపట్టిన యజమాని ఆసీఫ్‌కు రూ. పదివేల జరిమానా విధించి జేసీబీని సీజ్ చేసినట్లు తహసీల్దార్ మహేందర్‌కుమార్ తెలిపారు. అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవన్నారు.

పేకాట స్థావరంపై దాడి

వర్ని: మండలంలోని పొట్టిగుట్ట అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో రూ. 52,360 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కృష్ణ కుమార్ తెలిపారు.

లింగాపూర్ శివారులో..

కామారెడ్డి క్రైం: మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ శివారులో పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేశారు. దాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.24,780 నగదు, 2 బైకులు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఇద్దరి మృతి



సరిత (ఫైల్)

రాజంపేట:అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని షేర్ శంకర్ తండాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన కాట్రోత్ సూర్య భార్య సరిత (30), అతని తమ్ముడు కాట్రోత్ సర్దార్ భార్య రాజేశ్వరిల మధ్య నిత్యం గొడవలు జరుగుతుండేవి. మంగళవారం రాత్రి సైతం సరిత, రాజేశ్వరిల మధ్య కుటుంబ విషయంలో పెద్ద గొడవ జరిగింది. బుధవారం ఉదయం సరిత అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. విషయం తెలుసుకున్న సరిత తల్లిదండ్రులు, కుటుంబీకులు పెద్ద ఎత్తున తండాకు తరలివచ్చి సూర్య, సర్దార్, రాజేశ్వరీలపై దాడి చేయడంతో వారు పారిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గొడవను సద్దుమనిగించారు.అనంతరం మృతురాలి తండ్రి మాలోత్ మోజీరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైపేర్కొన్నారు.

శెట్పల్లిసంగారెడ్డిలో..



కమలవ్వ (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన మద్దెల కమలవ్వ(65) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. మృతురాలు రెండు రోజులు గా కనిపించకపోవడంతో గ్రామస్తులు హైదరాబాద్‌లో ఉంటున్న కొడుకు వినోద్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. బుధవారం సాయంత్రం ఇంట్లోకి వెళ్లి చూడగా కమలవ్వ మృతి చెంది ఉంది. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్, సదాశివనగర్ సీఐ, లింగంపేట ఎస్సై ప్రభాకర్ ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. బంగారం కోసం వృద్ధురాలిని దుండగులు హత్య చేసి ఉంటాని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.